ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 22 జూలై 2024


మాధవాయిపాలెం రేవులో నిలిచిన పంటు, పడవలు

రెండు జిల్లాల మధ్య రాకపోకలు బంద్

నరసాపురం టౌన్,జూలై 21: నరసాపురం- సఖినేటి పల్లి రేవుల మధ్య ఆదివారం పంటు రాకపోకలు నిలిపి వేశారు. మధ్యాహ్నం నుంచి వరద ఉధృతి పెరగడంతో కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు మండల పరిషత్ అధికారులు ఈ నిర్ణయం తీసుకొన్నారు. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముందస్తు సమాచారం లేకపోవడంతో రేవులకు వచ్చిన ప్రయాణికులు తిరిగి వెనక్కి వెళ్లాల్సి వచ్చింది. చించినాడ మీదుగా కోనసీమ తరలి వెళ్లారు. ఎగువ నుంచి వరద ఉధృతి పెరగడంతో సముద్రంలోకి లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఆదివారం వశిష్ఠ గోదావరికి సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు తాకింది. దీంతో రేవుల వద్ద నీటి మట్టాలు గంట గంటకు పెరుగుతున్నాయి. అధికారులు అప్రమత్తమయ్యారు. ఏటిగట్టు శాఖ సిబ్బంది గట్టులపై పర్యవేక్షిస్తున్నారు. బలహీనంగా ఉన్నచోట్ల ఇసుక బస్తాలు వేస్తున్నారు. ఆ శాఖ ఏఈ సుబ్బారావు స్లూయిస్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఇప్పటికే పట్టణంలోని ఐదు తూములను మూసివేశారు.



రొయ్యకు వర్షాల దెబ్బ

తెగుళ్లు, ఆక్సిజన్ లోపంతో ఇబ్బందులు

భీమవరం రూరల్, జూలై 21 : వర్షాలకు రొయ్య సాగు కుదేలైంది. ఆక్సిజన్ లోపం, తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దాదాపు 15 రోజుల నుంచి ఎండ లేకపోవడంతో రొయ్య సాగు అతలాకుతలమైంది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చాలా ప్రాంతాల్లో రొయ్యల చెరువులలో ఆక్సిజన్ లోపం, ఇతర తెగుళ్లు సంక్రమించడంతో భారీగా పెట్టుబడులు పెట్టాల్సి వస్తున్నది. జిల్లాలో 90 వేల ఎకరాలలో రొయ్య సాగు సాగుతుండగా వర్షాకాలం సాగుగా నెల రోజుల నుంచి సాగు మొదలు పెట్టారు. సాగు ఆదిలోనే ఉండటంతో రొయ్య ఎక్కువ కౌంట్ ఉంది. ఈ సమయంలో రొయ్య పట్టుబడి జరిగితే తీవ్ర నష్టం చవిచూడాలి. తెగుళ్ళు, ఆక్సిజన్ లోపాన్ని అధిగమించేందుకు రైతులు చెరువుల్లో సస్యరక్షణ చర్యలు చేపడుతున్నారు.



గ్రాసం లేక పశువులు విలవిల

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21: ముంపు ప్రాంతాల్లో మూగజీవాలు విలవిల్లాడుతున్నాయి. ఒక పక్క పంటచేలన్నీ నీటిలో నిండిపోవడం ఇటు పచ్చిగడ్డి, నిల్వ చేసిన ఎండుగడ్డి వరదనీటిలో మునిగిపోవడంతో గ్రాసం లేక పశువులు అల్లాడుతున్నాయి. పాడి రైతులు మాత్రం వాటి బాధ చూడలేక విలవిల్లాడుతున్నారు. నందమూరుకు చెందిన రైతు బొయిడి రామారావుకు నాలుగు గెదెలు ఉన్నాయి. నాలుగు రోజులుగా వరిచేలు నీటముంపులో ఉండటంతో ఎండు గడ్డి ముంపులో నానుతోంది. దీంతో పశువులకు గడ్డిలేక బయట గ్రామాలకు వెళే పరిస్థితి లేక రామారావు విలవిల్లాడుతున్నారు. మారంపల్లికి చెందిన శ్రీనివాస్‌కు మూడు గెదులు, రెండు దూడలు ఉన్నాయి. వాటికి గ్రాసం లేక అల్లాడుతున్నాయి. ప్రభుత్వం వెటర్నరీ శాఖ ద్వారా దాణా అందించాలని శ్రీనివాస్ కోరుతున్నాడు. మండలంలోని నందమూరు, ఆరుళ్ల, మారంపల్లి, మాధవరం, జగన్నాధపురం, వీరంపాలెం, పట్టింపాలెం గ్రామాల్లో ఇలాంటి పరిస్థితే ఉంది.

నేడు పాఠశాలలకు సెలవు

భీమవరం టౌన్, జూలై 21 : జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా సోమవారం జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. అలాగే జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు కూడా సోమవారం సెలవు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.


ఇరగవరంలో నీట మునిగిన చేలు చూపుతున్న రైతులు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీరం దాటి బలహీన పడినా జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ పంట పొలాలు ముంపు బారిన పడ్డాయి. మూడు రోజుల పాటు జిల్లాలో కురిసిన వర్షాలకు 36,445 ఎకరాల్లో పంట నీటమునిగింది. అధిక వర్షాలకంటే మొరాయించిన డ్రెయిన్లు రైతులను నిండా ముంచేశాయి. జిల్లాలో వరి పంటకు భారీగా నష్టం వాటిల్లింది.


యండగండి లాకులపైన ప్రవహిస్తున్న నీరు

ముంచేసింది

పెరుగుతున్న పంట నష్టం
నీరు పోవాలంటే పది రోజులు ఆగాల్సిందే..
మొరాయించిన డ్రెయిన్లు
జిల్లాలో 35,445 ఎకరాల్లో నాట్లు మునక
2,768 ఎకరాల్లో నారుమడులు ముంపు
నష్టం అంచనాల్లో అధికారులు


[illegible]

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో 87,660 ఎకరాల్లో వరినాట్లు వేశారు. అంతలోనే వర్షాలు రైతులను వెంటాడాయి. డ్రెయిన్లు సవ్యంగా ఉంటే పంట నష్టం ఇంతలా ఉండేది కాదు. వర్షాలు తగ్గిన వెంటనే ముంపు నుంచి పొలాలు బయటపడేవి. వరినాట్లకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ మరో 10 రోజుల పాటు పొలాల నుంచి నీరు బయటకు వెళ్లే మార్గం కానరావడం లేదు. జిల్లాలో ఉండి, భీమవరం రూరల్. వీరవాసరం, పెంటపాడు తదితర మండలాల్లో డ్రెయిన్లు పూర్తిగా బిగబట్టేశాయి. ఐదేళ్లపాటు పిడికెడు మట్టి తీయక పోవడంతో తాజా వర్షాలకు ముంపు తీవ్రత అధికమైంది. పొలాల్లో నీరు వెళ్లేటప్పటికీ నాట్లు కుళ్లిపోనున్నాయి. జిల్లాలో 2,768 ఎకరాల విస్తీర్ణంలో నారుమడులు ముంపు బారినపడ్డాయి. దాదాపు ఏడు వేల ఎకరాల విస్తీర్ణంలో నారుమళ్లకు ఇబ్బంది లేదని వ్యవసాయ అధికారులు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపారు.

తక్కువ కాలవ్యవధి రకాలకు సన్నద్ధం

వర్షాలు కాస్త తెరిపి ఇవ్వడంతో కొత్త సాగు కోసం మళ్లీ వ్యవసాయ శాఖ ప్రణాళిక చేస్తోంది. పంట కాలం తక్కువ వ్యవధి ఉన్న రకాలు వేసుకోవాలని రైతులకు సూచిస్తోంది. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు విడుదలైతే రైతులకు పంపిణీ చేసేలా విత్తనాలు సిద్ధంగా ఉంచారు. జిల్లాలో ఎంటీయు 1153, ఎంటీయు 1156 రకాలు వ్యవసాయ శాఖ వద్ద నిల్వ ఉన్నాయి. వాటిని సాగు చేసుకుంటే తక్కువ వ్యవధిలోనే రైతులకు మళ్లీ పంట చేతికి రానుంది. పీఆర్ 126 రకం కూడా వేసుకోవచ్చు. కానీ ప్రభుత్వం వద్ద నిల్వలేవు.

నష్టం అంచనాలు

నష్టం అంచనాలు రూపొందించేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సన్నద్ధంగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి సూచనాలు వెలువడితే క్షేత్ర స్థాయిలో నష్టాలను అంచనా వేసి రైతుల వారీగా నమోదు చేయనున్నారు.ప్రస్తుతానికి జిల్లాలో దాదాపు 25 వేల మంది రైతులకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో వివరాలను నమోదు చేయాల్సి ఉంది.

వదలని ఎర్రకాలువ వరద

ఆరుళ్ల వద్ద ఎర్రకాల్వ గట్టుకు గండి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21: ఎర్రకాలువ వరద వదలడం లేదు.మండలంలోని వీరంపాలెం, పట్టింపాలెం, అప్పారావుపేట, జగన్నాధపురం, మారం పల్లి, నందమూరు, ఆరుళ్ల గ్రామాల్లో వరదనీరు రోజురోజుకు పెరుగుతోంది. ఆరుళ్ల వద్ద ఎర్రకాల్వకు ఆదివారం గండి పడటంతో పంట చేలు మునిగాయి.ఆరుళ్ల నుంచి కోనాల వెళ్లే రోడ్డు మార్గం తెగిపోయింది. మండలంలోని జగన్నాధపురం-మాధవరం రోడ్డులో వరదనీరు చేరడంతో ఆ రెండు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాధవరం-కంసాలిపాలెం గ్రామాల మధ్య ఇప్పటికే రాకపోకలు నిలిచిపోయాయి. నందమూరు, జగన్నాధపురం, ఆరుళ్ల గ్రామాల్లోకి వరదనీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇళ్ల నుంచి కాలుబయట పెట్టే పరిస్థితి లేదు. విష సర్పాలు, పురుగులు ఇళ్లలోకి వస్తుండటంతో భయంతో వణికిపోతున్నారు.

ముంచుకొస్తున్న గోదావరి

భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక
ఆందోళనలో కుక్కునూరు , వేలేరుపాడు ప్రజలు
పునరావాస కేంద్రాలకు ఏడు గ్రామాల్లో ఉన్న 432 కుటుంబాలు



కుక్కునూరు/ వేలేరుపాడు/ పోలవరం జూలై 21: గోదావరికి వరద ముంచు కొస్తున్నది. భద్రాచలం వద్ద నీటిమట్టం 43 అడుగులకు చేరుకోవడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. రాత్రికి రెండవ ప్రమాద హెచ్చరిక 48 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరే అవకాశం ఉన్నందున తీర ప్రాంత ప్రజలంతా అప్ర మత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. భద్రాచలం నుంచి దిగువ పోలవరానికి 8,85,224 క్యూసెక్కుల నీరు విడుదల వుతున్నట్లు అధికారుల అంచనా. తెలంగాణలోని సమ్మక్క బ్యారేజ్ నుంచి 8.50 లక్షలక్యూసెక్కుల నీటిని తాలిపేరు ప్రాజెక్టు నుంచి 50 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే శబరి వరద ప్రవాహం పెరుగుతోంది. దీంతో కుక్కునూరు, వేలేరు పాడు మండలాల్లో వరదనీరు పెరిగింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై ముంపునకు గురయ్యే గ్రామాలపై దృష్టి పెట్టారు. కుక్కునూరు మండలంలోని గొమ్ము గూడెంలో ఉన్న 132 కుటుంబాలను దాచారం పునరావాస కాలనీకి తరలిస్తున్నారు. వేలేరుపాడు మండలంలోని రుద్రమ్మకోట, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, తిరుమలాపురం, నాళ్ళవరం, జిగురుమామిడి గ్రామాల్లో ఉన్న దాదాపు మూడు వేల కుటుంబాలను పునరావాస కాలనీలకు తరలిస్తున్నారు. దాచారం పునరావాస కానీలో గొమ్ముగూడెం ప్రజలక దాచారం పునరావాస కాలనీలో భోజన సదుపాయం, విద్యుత్ సౌకర్యం, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అచ్యుతకుమారి తెలిపారు. రెండో ప్రమాద హెచ్చరిక జారీ అయ్యే అవకాశం ఉన్నందున కౌండిన్య ముక్తి, లచ్చిగూడెం గ్రామస్థులను కూడా తరలిస్తామని తహసీల్దార్ తెలిపారు. ఇది ఇలా ఉండగా పోలవరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. స్పిల్‌వే వద్ద గోదావరి నీటిమట్టం 31.900 మీటర్లు ఉండగా 8 లక్షల 37 వేల 179 క్యూసెక్కుల నీటిని దిగువకి విడుదల చేశారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గర్భిణులను,బాలింతలను ముందు జాగ్రత్తగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు డీంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడులలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి 28 మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో తాగునీటి అవసరాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ సత్యనారాయణ తెలిపారు.

లంకగ్రామాలకు వరదనీరు



ఆచంట/యలమంచిలి : గోదావరి ఉధృతి పెరగడంతో ఆచంట, యల మంచిలి మండలంలోని లంకగ్రామాల్లో వరదనీరు పెరుగుతోంది. కోడేరు, పెదమల్లం, కరు గోరుమిల్లి, భీమలాపురం పుష్కరగాట్‌లు పూర్తిగా నీట మునిగాయి. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో గోదావరిలో నాటు పడవలు రాకపోకలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వేపై వరదనీరు చేరుతోంది. ఆదివారం సాయంత్రానికి కాజ్‌వేపై సుమారు ఒక అడుగు వరదనీరు ప్రవహిస్తోంది. కాజ్‌వే పూర్తిగా నీటమునిగితే పడవలపైనే రాకపోకలు సాగించాలి. సోమవారం సాయంత్రానికి కాజ్‌వే పూర్తిగా నీట మునిగిపోయే అవకాశం ఉంది.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, జూలై 21 :వశిష్ఠ గోదావరి నీటి ప్రవాహం పెరుగుచున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి సూచించారు. గోదావరి నది పరివాహక మండలాలు, లంక ప్రాంతాలు నరసాపురం,మొగల్తూరు, యలమంచిలి, ఆచంట, పెనుగొండ మండలాలపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. వర్షాలు తగ్గుతున్నా ఎగువున కురుస్తున్న వర్షాల వల్ల వరదల రూపంలో జిల్లాకు ప్రమాదం వచ్చే అవకాశం ఉందని అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.

కుళ్లిపోయిన నారుమళ్లు



పోడూరు, జూలై, 21: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు మునిగిన నారు మడులు కుళ్లిపోతున్నాయి. నక్కల డ్రైన్, కాజ డ్రైన్‌లు పొంగి పొర్లడంతో ఆచంట, పాలకొల్లు నియోజకవర్గాల్లో వేలాది ఎకరాల్లో వరినాట్లు, వందలాది ఎకరాల్లో నారుమళ్లు వారం రోజులతో నీటిముంపులో ఉంటూ చివరకు కుళ్లిపోయాయి. పెనుమదంలో కూటమి నాయకులతో కలిసి సర్పంచ్ తానేటి బాబూరావు ఆదివారం కుళ్లిన వరినాట్లును, నారుమళ్లను పరిశీలించారు. సుమారు 120 ఎకరాల్లో నారుమళ్లు పూర్తిగా కుళ్లిపోవడాన్ని గుర్తించారు. మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్లి జరిగిన నష్టాన్ని వివరిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.



• పూర్తిగా కుళ్లిపోయింది

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో ఎనిమిది ఎకరాలు సాగు చేసు కునేందుకు వేసుకున్న వరి నారుమడి పూర్తిగా కుళ్లిపోయింది. ఇప్పటికే సుమారు రూ.10 వేలు పెట్టుబడి పెట్టాను. చివరకు నారుమడి మొత్తం కుళ్లిపోయింది. పెట్టిన పెట్టుబడి అంతా నష్టపోయాను.

- పిప్పరపల్లి పెద్దిరాజు, కౌలు రైతు, పెనుమదం



• నాట్లు కుళ్లిపోయాయి

పదిరోజుల క్రితం ఏడు ఎకరాల్లో వరినాట్లు వేశాను. నాటిన నాల్గొ రోజుకే వర్షాలు మొదలయ్యాయి. వారం రోజులుగా కురుస్తున్న భారీవర్షాలకు వరినాట్లు పూర్తిగా నీట మునిగి కుళ్లిపోయాయి.చేలో నీరు బయటకు తోడుదామన్నా వీలు కాలేదు. ఇప్పటికే రూ.15 వేలు పెట్టుబడి పెట్టాను. అంతా నష్టపోయాను.

- కవురు విఘ్నేశ్వరరావు, కౌలు రైతు, పెనుమదం


నరసాపురం మండలం వైఎస్‌పాలెంలో చెరువుల్లా చేలు


ఆరుళ్లలో వరదనీటి ముంపులో అమ్మవారి ఆలయం


వరదనీటిలో ఆరుళ్ల గ్రామస్తుల అవస్థలు


యండగండి సంతమార్కెట్ ఏరియాలో ఇసుక బస్తాలతో అడ్డుకట్ట

పేదోడి కడుపు నిండుగా..

సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్లు
ఆగస్టు 15 నుంచి ప్రారంభానికి సన్నాహాలు


తాడేపల్లిగూడెంలో సిద్ధం చేస్తున్న అన్న క్యాంటీన్

తాడేపల్లిగూడెం రూరల్, జూలై, 21 : పేదవాడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్‌ల పునరుద్ధరణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. గతంలో నిర్మించిన అన్న క్యాంటీన్లకు మరమ్మతులు చేస్తున్నారు. ఆగస్టు 15 నుంచి క్యాంటీన్‌లు ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. పేదలకు కడుపునిండా అన్నం పెట్టే ఉద్దేశంతో గత టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం పట్టణాల్లో అన్న క్యాంటీన్‌లను నిర్వహించారు. రూ.5కే భోజనం, అల్పాహారం అందించారు. కానీ 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం రాగానే కక్ష సాధింపు చర్యల్లో భాగంగా పేదోడికి అన్నం పెట్టే ఈ మంచి కార్యక్రమాన్ని అర్ధంతరంగా ఆపేసింది. వాటిని ప్రభుత్వ సచివాలయాలుగా కొన్ని, మరికొన్నింటిని బూత్ బంగ్లాలుగా మార్చింది. దీంతో తమకు అన్నం పెట్టిన ఆ క్యాంటీన్‌ల వైపే పేదలు ఆశగా చూసేవారు.

జిల్లాలో 9 భవనాలకు మరమ్మతులు

వైసీపీ ప్రభుత్వంలో నీరుగార్చడంతో అన్న క్యాంటీన్ భవనాలు ప్రస్తుతం మొక్కలు పెరిగిపోయి చెత్తా చెదారాలతో నిండిపోయాయి. ఎన్నికల హామీలో భాగంగా ఆగస్టు 15 నుంచి వాటిని ప్రారంభించనుండడంతో మరమ్మతులు చేసి సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో తాడేపల్లిగూడెం 3, భీమవరం 2, తణుకు 2, పాలకొల్లు, నరసాపురంలలో ఒక్కో క్యాంటీన్‌లను ప్రారంభించేందుకు ఇప్పటికే మరమ్మతులు ప్రారంభించారు. తాడేపల్లిగూడెంలో మున్సిపల్ కార్యాలయం వద్ద, మార్కెట్‌లో, తాలూకా కార్యాలయ కూడలిలో అన్న క్యాంటిన్‌లను సిద్ధం చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో వంద వారాలకు పైగా అన్నదానం

వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అన్నా క్యాంటీన్‌లను పునరుద్ధరించాలని ప్రజల ఆకాంక్షల మేరకు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి ఆధ్వర్యంలో ప్రతీ మంగళవారం అన్న క్యాంటిన్ వద్ద అన్నదాన కార్యక్రమం చేపట్టి నేటికీ కొనసాగిస్తున్నారు.



దిగి వస్తున్న కూరగాయలు

గతవారం కన్నా తగ్గిన ధరలు

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21: కూరగాయల ధరలు దిగివచ్చాయి. గతవారంతో పోలిస్తే ఉల్లిపాయలతో పాటు ఇతర కూరగాయల ధరలు తగ్గుముఖం పట్టాయి. చిక్కుడు కాయలు మాత్రం కిలో రూ.220 పలుకుతూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. కేజీ లెక్కన కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. ఉల్లి ధరలు గత వారంతో పోలిస్తే రూ.40 నుంచి 30కి చేరుకుంది. వాటితో పాటు టమాట రూ.100 నుంచి 80కి, పచ్చిమిర్చి 60 నుంచి 40కి, నల్లవంకాయి రూ.100 నుంచి 80కి తగ్గాయి. బెండకాయలు రూ.80 నుంచి 60కి, దోసకాయలు రూ.50 నుంచి 30, బీరకాయలు రూ.80 నుంచి 60, కాకరకాయలు రూ.100 నుంచి 80, కాకరకాయలు రూ.100 నుంచి 80, క్యారెట్ రూ.80 నుంచి 60కి దిగాయి. కంద రూ.100, అల్లం రూ.200, బంగాళదుంపలు రూ.40, క్యాప్సికం రూ.100, బీన్స్ రూ.120 చొప్పున నిలకడగా కొనసాగుతున్నాయి.

సైబర్ కేటుగాళ్లు 7





శాకంబరిగా మావుళ్లమ్మ

ఆషాడ పౌర్ణమి సందర్భంగా ఆదివారం మావుళ్ళమ్మ అమ్మవారు భక్తులకు శాకాంబరిదేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు. సుమారు 5 టన్నుల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణమంతా అలంకరణ చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు - **భీమవరం టౌన్**



ఘరానా మోసగాళ్లు

ప్రతి ఒక్కరూ తమ కుటుంబ అవసరాల కోసం రూపాయి..రూపాయి కూడబెట్టుకుంటారు. ఆ విధంగా పొదుపు చేసిన నగదును ఎవరో వచ్చి తన్నుకుపోయినట్టు ఘరానా మోసగాళ్ల వలలో పడి ప్రజలు మోసపోతున్నారు. అమాయక ప్రజల మంచితనాన్ని ఆసరాగా చేసుకుని నిలువుదోపిడీ చేస్తున్నారు. చౌకగా బంగారం వస్తుందని ఆశపడి ఉన్నది కూడా పోగొట్టుకుంటున్న సందర్భాలు అనేకం. కొంతమంది అమాయకత్వం.. అతి మంచితనం.. అత్యాశలను ఆసరాగా చేసుకుని మధ్యతరగతి, ఉన్నత వర్గాలను నిలువునా దోచుకుంటున్నారు. చదువుకున్న వారు కూడా ఆ సమయంలో అప్రమత్తంగా లేకపోవడంతో నగదు పోగొట్టుకున్న తరువాత మోసపోయామని గ్రహించి ఏమిచేయలేక మిన్నకుండిపోతున్నారు. మోసగాళ్ల మాయమాటలకు లోబడి సర్వస్వం పోగొట్టుకుని కుటుంబానికి అప్పులు మిగిలుస్తున్నారు. ఇటీవల భీమవరం, గణపవరం, ఏలూరు, నిడమర్రు పరిసర ప్రాంతాల్లో జరిగిన కొన్ని సంఘటనలే దీనికి నిదర్శనం. ఈ ఘరానా మోసగాళ్ల తీరును గమనించి అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- నిడమర్రు

నకిలీ బంగారంతో మోసగిస్తున్న దొంగలు

■ **నకిలీ బంగారంతో మోసం**

పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రు మండలంలోని కొల్లేరు ప్రాంతానికి చెందిన ఓ యువకుడు గణపవరంలో (ఊరిపేరు మార్పు) ఓ షాపు అద్దెకు తీసుకొని రెడీమేడ్ షాపు నిర్వహిస్తున్నారు. ఇటీవల 40 ఏళ్ల వయసుగల వ్యక్తితో పాటు మరో మహిళలు షాపునకు వచ్చి వరుసగా మూడు రోజులపాటు వస్తూ ప్రతిరోజు వెయ్యి నుంచి మూడు వేల రూపాయల వరకు దుస్తులు కొనుగోలు చేస్తూ పరిచయం పెంచుకున్నారు. వారం రోజుల తరువాత "అయ్యా మాకు ఒక చోట బంగారం బిస్కెట్ దొరికింది, ఇది నిజం బంగారమా కాదా మాకు చెక్ చేసి చెప్పండి మీకు పుణ్యముంటుంది' అని వేడుకోగా షాపు యజమాని ఆ మాటలు నమ్మి కొంతమంది స్వర్ణకారుల వద్దకు తీసుకెళ్లగా వారు పరిశీలించి ఇది నిజమైన బంగారమే అని నిరూపించి చూపించారు. ఇదే విషయాన్ని వారికి చెప్పగా.. ఈ బంగారం అమ్మాలంటే మావల్ల కాదు, ఏదో ఒక రేటుకి సగం రేటుకైనా మీరే అమ్మిపెట్టండంటూ వేడుకనాన్నారు. సగం ధరకే బంగారం వస్తుందనే ఆశతో ఇంట్లో భార్య మంగళసూత్రాలు తాకట్టుపెట్టి, తెలిసిన వారి వద్ద అప్పుచేసి నాలుగు లక్షలు రూపాయలు చెల్లించి ఆ బంగారం బిస్కెట్లు తీసుకున్నాడు. వారం రోజుల తర్వాత ఆ బంగారాన్ని వస్తువు చేయిద్దామని స్వర్ణకారుని వద్దకు తీసుకెళ్లగా ఇది బంగారమే కాదని చెప్ప డంతో అవాక్కయ్యాడు. షాపు యజమానికి చూపించిన బంగారం బిస్కెట్‌ను పోలిన నకిలీ బంగారంతో మోసగించారు.

■ **పెళ్లి వేడుకలలో వడ్డాణం దొరికిందని..**

భీమవరం (ఊరిపేరు మార్పు) సమీపాన గల ఓపల్లెలో చికెన్ షాపు యజమాని వద్దకు ఒక పెద్ద మనిషి వచ్చి ప్రతి రోజూ కోడి మాంసం కొట్టించుకుని వెళుతూ పరిచయం పెంచుకున్నాడు. షాపు యజమాని ఏం చేస్తున్నావని అడిగితే మాది గుంటూరు జిల్లా అని బిల్డింగ్ పనులకు మనుషులను సరఫరా చేస్తామని చెప్పుకొచ్చాడు. ఓ వారం తర్వాత ఒక సంచిలో బంగారం వడ్డాణం తీసుకువచ్చి మాకు పెళ్లిమండపం వద్ద దొరికిందని దీనికి రేటు కట్టించమని, ఇది ఒరిజినల్ బంగారమోద కాదో తేల్చాలని విన్నవించాడు. వడ్డాణంలో చిన్న ముక్క కట్ చేయించి తీసుకెళ్లగా ఒరిజినల్ బంగారమని తేలింది. ఇదే విషయాన్ని ఆ మేస్త్రికి తెలిపాడు. నేను ఈ ఊరిలో అమ్మలేను ఏదో ఒక రేటు మీరే అమ్మిపెట్టండని చెప్పడంతో చికెన్ షాపు యజమానికి ఆశ పుట్టి.. 16 లక్షల రూపాయలు విలువ గల వడ్డాణాన్ని సగం ధరకు అంటూ 8 లక్షలు చెల్లించాడు. వారం రోజుల తరువాత ఓ పెళ్లివేడుకకు వడ్డాణం పెట్టుకొందామని బీరువాలో నుంచి తీస్తే దానిపై తెల్లటి మచ్చలు ఉండడంతో అనుమానం వచ్చి చెక్ చేస్తే ఒరిజినల్ బంగారం కాదని మోసపోయినట్టు తెలిసింది.

■ **ప్లాటినమ్ బిస్కెట్ అంటూ మోసం**

ఏలూరులో (పేరుమార్పు) ఎన్నికలకు ముందు ఏలూరులో ఓ ఆక్వా వ్యాపారి వద్దకు ఓ తెలుగు వ్యక్తి వచ్చి ముంబై నుంచి వచ్చామని ప్లాటినమ్ బిస్కెట్లు అమ్మకానికి తెచ్చామని ఎన్నికల వల్ల డబ్బులు లేక ఎవరూ, బంగారంషాపు వాళ్లు కొనడం లేదని వెనక్కి తీసుకెళ్దామంటే పోలీస్ చెకింగ్‌లు ఎక్కువగా ఉన్నాయని, సగం రేటు అమ్మేస్తానని చెప్పుకొచ్చాడు. బిస్కెట్ ధర రూ.10 కోట్లు అని చెప్పి తన వద్ద నాలుగు బిస్కెట్లు ఉన్నాయని, బయట మార్కెట్‌లో చెక్ చేసుకొని సొమ్ము ఇవ్వాలని తెలిపారు. ఆ వ్యాపారస్థుడు మరో ముగ్గురు మిత్రులతో కలిసి చెక్ చేయించగా ఒరిజినల్ ప్లాటినమ్ అని తేలడంతో సగం ధర రూ. 5 కోట్లు చెల్లిస్తామని.. మూడు కోట్లు అడ్వాన్స్‌గా చెల్లిస్తామని చెప్పారు. మిగిలిన సొమ్ము వారంలోగా సర్దుబాటు చేస్తామని ఒప్పందం కుదురుకుని మూడు కోట్లు చెల్లించారు. ఈ వారం రోజులలో ఆక్వా వ్యాపారి రాజమండ్రి, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో చెక్ చేయించగా అందరూ ప్లాటినమ్ ఒరిజినల్‌గా నిర్ధారించారు. వారం తరువాత మిగిలిన రూ. 2 కోట్లు చెల్లించారు. ఆ సమయంలో సదరు వ్యక్తి మీకిచ్చిన ప్లాటినమ్ బిస్కెట్ సీరియల్ నంబరు నోట్ చేసుకోవడం మరిచిపోయానని ఒక్కసారి తెమ్మని చెప్పి కాసేపు పరిశీలించి తిరిగి ఇచ్చేసి మిగిలిన సొమ్ము వసూలు చేసుకుని వెళ్లాడు. తరువాత ప్లాటినమ్ కట్ చేసి పంచుకొందామని భావించిన ఆ ముగ్గురు వ్యాపారులకు అది రజనుగా రాలిపోవడంతో అనుమానం వచ్చి పరిశీలించగా డూప్లికేట్ అని తేలింది. ఆ వ్యాపారి ఇంట్లో గల సీసీ కెమేరాల్లో కూడా ఆ బంగారం వ్యాపారి చిత్రాలు నమోదు కాబడలేదు.

అమాయక ప్రజలే లక్ష్యంగా..



అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొన్ని ముఠాలు బంగారం అని చెప్పి నకిలీ బంగారాన్ని అమ్ముతున్నారు. బంగారం సగం ధరకు ఇస్తామంటే ఎవరూ నమ్మవద్దు. నమ్మి మోసం పోవడం కన్నా ముందుగా తెలివితో జాగ్రత్త వహించడం మంచిది. నకిలీ బంగారం అమ్మకం విషయంలో పోలీసులు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరుతున్నాం.

- నేచర్ల శ్రీనివాసరావు, వైస్ చైర్మన్, జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



కొన్ని ముఠాలు ఉన్నత కుటుంబాలను, అమాయక ప్రజలను టార్గెట్ చేస్తూ బంగారం సగం ధరకు ఇస్తామని చెప్పి సొమ్ములు కాజేస్తుంటాయి. ఎవ్వరూ ఒరిజినల్ బంగారం సగం ధరకు ఇవ్వరని గుర్తుంచుకోండి. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నకిలీ బంగారం ముఠా సభ్యుల ఉచ్చులో పడవద్దు. ఒక వేళ మోసపోతే పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేయండి. నేరస్తులను పట్టుకుని శిక్షపడేలా చేస్తాం. మోసం జరగక ముందే అప్రమత్తంగా ఉండాలి.

- ఈ.శ్రీనివాసులు డీఎస్పీ, ఏలూరు డివిజన్

సైబర్ కేటుగాళ్లు

ఆర్థిక నేరాలకు కొత్త పంథా

» అందమైన యువతులతో చాటింగ్ అంటూ లింకు » క్షణాల్లో లక్షల రుణమంటూ సమాచారం



నరసాపురం, జూలై 21: సైబర్ కేటుగాళ్లు మోసగించడంలో రూట్ మార్చారు, గతంలో మాదిరిగా ఓటీపీలు అడగడం లేదు, మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకుని క్షణాల్లో ఖాతాల్లోని సొమ్మును కాజేస్తున్నారు. కష్టాల్లో ఉన్న మిమ్మల్ని ఆర్థికంగా ఆదుకుంటామని నమ్మబలికి లింకులు పంపుతున్నారు. వీటిని క్లిక్ చేస్తే మీకు రుణం అందుతుందని ఆశచూపి కొట్టేస్తున్నారు. క్లిక్ చేయగానే మన ఖాతాల్లోని సొమ్మంతా మాయమైపోతుంది. ఈవిధంగా మోసపోయిన వాళ్లు జిల్లాలో ఎంతోమంది ఉన్నారు. గతంలో ఈ మోసాలు వేరేవిధంగా ఉండేవి, బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి వివరాలు సేకరించేవారు. మీ ఏటీఎం, క్రెడిట్ కార్డుల అప్‌డేట్ చేస్తున్నామని నమ్మబలికి ముందుగా మన వివరాలన్ని చెప్పేవారు. ఇవన్నీ కరెక్ట్‌గా ఉండడంతో బ్యాంకు అధికారులని నమ్మి ఓటీపీ చెప్పేవారు. అంతే ఖాతాల్లో సొమ్ము మాయమయ్యేవి. ఇది అందరికీ తెలిసిపోవడంతో కేటుగాళ్లు ఈ మోసాల్లో కొత్త పంథా ఎంచుకున్నారు. ఎక్కువగా రుణం తీసుకున్న వారి వివరాలను సేకరించి ముందుగా వారికి లింకు పంపుతున్నారు. క్లిక్ చేయగానే ఖాతాల్లో సొమ్ము కనిపించడం లేదు. ప్రస్తుతం సైబర్ నేరగాళ్లు ఎక్కువగా ఈ తరహా ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నారు.

వీటితో పాటు అందమైన మహిళలతో వీడియో కాల్స్ చేయిస్తున్నారు. ముందుగా మాట కలిపి నూడ్ కాల్స్‌కు రెచ్చగొడుతున్నారు. ఏమాత్రం ఆకర్షితులైనా చాలు వాటిని రికార్డు చేసి బ్లాక్ మెయిల్‌కు పాల్పడి డబ్బులు గుంజుతున్నారు. ఇది కాకుండా కొత్తగా నార్కోటిక్ అధికారులమంటూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారు.. మీరు విదేశాల నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకుని వ్యాపారం చేస్తున్నారనే సమాచారం మా దగ్గర ఉంది, అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. చాలామంది ముందుగా వీరు చెప్పిన వివరాలన్నీ కరెక్ట్‌గా ఉండంతో ఆందోళన చెందుతున్నారు. ఈ విధమైన మోసాలతో ప్రజలు భయంతో బెంబేలెత్తిపోతున్నారు.

■ జిల్లాలో ఆయన ఓ ముఖ్య రాజకీయ నాయకుడు, మాజీ ప్రజాప్రతినిధి కూడా.. గత నెలలో ఆయనకు ఒక ఫోన్ కాల్ వచ్చింది, ముంబై నుంచి నార్కోటిక్ అధికారులమంటూ ఫోన్ చేసి.. ముందుగా ఆయన ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలతో పాటు అడ్రస్ చెప్పారు, ఇవన్నీ మీవేనా..? అంటూ హిందీలో గద్దించారు. ఆ నాయకుడు కరెక్ట్ అని సమాధానం ఇచ్చారు.. అంతే.. మీరు విదేశాల నుంచి డ్రగ్స్ దిగుమతి చేసుకుంటున్నారు, మా దగ్గర పూర్తి సమాచారం ఉంది, మేము వచ్చి మిమ్మల్ని అరెస్టు చేస్తున్నామంటూ బెదిరించారు, అయితే వారు నార్కోటిక్ అధికారులమని హిందీలోనే మాట్లాడారు.. ఇంగ్లీషులో మాట్లాడకపోవడంతో అనుమానం వచ్చి నిలదీశాడు పోలీస్ రిపోర్ట్ ఇస్తానని బెదిరించడంతో వెంటనే ఫోన్ కట్ చేశారు.

■ నరసాపురం ఎంపీడీవో వెంకటరమణ అదృశ్యం కాక ముందు ఇతర రాష్ట్రాల ఫోన్ కాల్స్ వచ్చేవి, ఆ నెంబర్లు చూస్తే చాలు ఆయన భయంతో బెంబేలెత్తిపోయేవారు. అవతల వ్యక్తులు డబ్బు పంపించాలని బెదిరింపులకు పాల్పడే వారు. వీటిని తట్టుకోలేక సిబ్బంది, కుమారుడి నుంచి అప్పుచేసి రూ.3 లక్షలుపైనే పంపారు. ఈ ఫోన్ కాల్స్ వస్తాయన్న భయంతో ఆయన తన చాంబర్‌లో కూర్చోకుండా సిబ్బంది మధ్యే కూర్చుని పని చేసేవాడు. సైబర్ నేరగాళ్లే ఆయనని బెదిరింపులకు పాల్పడి ఉండవచ్చన్న వాదనలు పోలీస్‌ల నుంచి వినిపిస్తున్నాయి.

■ నరసాపురం పట్టణానికి చెందిన ఒక వ్యక్తికి పది రోజుల క్రితం రాత్రి పూట వీడియో కాల్ వచ్చింది. వెంటనే అతను ఫోన్ ఆన్‌చేయగా.. ఒక యువతి నగ్నంగా కనిపించింది, ఇంగ్లీష్‌లో వీడియో కాల్ ఆన్ చేసిన వ్యక్తిని నువ్వు కూడా డ్రస్ విప్పి నాతో ఎంజాయ్ చేయాలంటూ ఉసిగొల్పింది, వెంటనే తేరుకున్న ఆ వ్యక్తి కాల్‌కట్ చేశారు, లేక పోతే హనీ ట్రాప్‌లో చిక్కుకునే వాడు.

■ భీమవరం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికి ఓ ప్రముఖ పైనాన్స్ కంపెనీ పేరుతో సమాచారం వచ్చింది. క్షణాల్లో రూ.10లక్షల రుణం వివరాలు చేస్తే ఖాతాలో సొమ్ముఅంటూ మేసేజ్‌లో సారాంశం ఉంది. అప్పటికే సైబర్ నేరాలపై అవగాహన ఉన్న ఆ వ్యక్తి ఫోన్‌లో ఉన్న లింకును క్లిక్ చేయలేదు, చేసి ఉంటే బ్యాంకు ఖాతాల్లో సొమ్మంతా మాయమయ్యేది.

లింకులు క్లిక్ చేయొద్దు..



వాట్సాప్‌లకు వచ్చే మెసేజ్‌లను ఎట్టి పరిస్థితుల్లో క్లిక్ చేయొద్దు.. తెలియని వ్యక్తులతో వీడియో కాల్స్ మాట్లాడొద్దు.. రుణాల పేరుతో ఎవరైనా ఫోన్ చేస్తే సమాచారం చెప్పొద్దు.. ముందుగా సైబర్ నేరగాళ్లు మనకు సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా సేకరిస్తారు, ఆ తరువాతే మనల్ని బెదిరించి డబ్బు డిమాండ్ చేస్తారు. వారు చెప్పిన వివరాలు కరెక్ట్‌గా ఉన్నాయని తెలిసినా.. భయపడకుండా సమాధానం చెప్పాలి. వెంటనే సైబర్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలి, ప్రతి జిల్లాలో ఒక సైబర్ పోలీస్‌స్టేషన్ ఉంది.

- శ్రీనివాస్, డీఎస్పీ, నరసాపురం

రైతు ఖాతా నుంచి రూ.6 లక్షలు మాయం

పాలకోడేరు, జూలై 21: గరగపర్రు గ్రామానికి చెందిన రైతు తన యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.6లక్షలు మాయం అయ్యాయి అంటూ పాలకోడేరు పోలీసులకు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన రైతు కశ్యపరహావతారం కుటుంబ అవసరాల కోసం పొలం అమ్మగా వచ్చిన సొమ్ము రూ.8లక్షలు గ్రామంలోని యూనియన్ బ్యాంకు ఖాతాలో దాచుకున్నాడు. శుక్రవారం బ్యాంకువారు పంపినట్టుగా రైతు ఫోన్‌కు లింకు వచ్చింది. ఆ లింకు ఓపెన్ చేయగా దఫదఫాలుగా ఆదేరోజు అతడి ఖాతా నుంచి రూ.6 లక్షలు మాయం అయ్యాయి. రైతు లబోదిబోమంటూ పాలకోడేరు పోలీసులను ఆశ్రయించాడు. పాలకోడేరు ఎస్ఐ నాళం శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



రూ.6 లక్షలు మాయమయ్యాయని సెల్ మెసేజ్ చూపిస్తున్న రైతు





కుక్కునూరు.. వేలేరుపాడులో గర్భిణులను ఆసుపత్రులకు తరలిస్తున్న సిబ్బంది

ప్రభుత్వాసుపత్రికి గర్భిణుల తరలింపు

» వైద్య శిబిరాల ఏర్పాటు.. అదనంగా వైద్య సిబ్బంది నియామకం

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 21: భారీ వర్షాలు, వరదల కారణంగా ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గర్భిణులు, బాలింతలను ముందు జాగ్రత్తగా ప్రభుత్వాసుపత్రికి తరలించామని డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట తెలిపారు. ఆదివారం కుక్కునూరు మండలం దాచారం పునరావాస కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేలేరుపాడు మండలానికి చెందిన తొమ్మిది మాసాలు నిండిన సీత అనే గర్భిణిని జంగారెడ్డిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. వరద బాధితులకు అందుతున్న వైద్యసేవలను ఆమె ఆరా తీశారు. కుక్కునూరు, వేలేరుపాడులలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ శిబిరాలకు 28 వైద్య సిబ్బందిని నియమించామన్నారు. అవసరమైన మందులు అందుబాటులో ఉంచామన్నారు. డిప్యూటేషన్‌పై ఇతర ప్రాంతాల నుంచి 16 మందిని వైద్య సేవల నిమిత్తం వినియోగిస్తున్నట్టు తెలిపారు.

'చెస్‌తో పిల్లల్లో ఏకాగ్రత పెంపు'



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న భూపతిరాజు ప్రవీణ్

భీమవరం అర్బన్, జూలై 21: చెస్‌తో పిల్లల్లో ఏకాగ్రత, సృజనాత్మకత పెరగడంతో బాల మేధావులుగా అభివృద్ధి చెందుతారని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ సతీమణి భూపతిరాజు ప్రవీణ్ అన్నారు. అంతర్జాతీయ చెస్‌దినోత్సవం సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం నర్సయ్య అగ్రహారంలోని ఏఆర్ఆర్ రెసిడెన్సీలో వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ ఫస్ట్ ర్యాంకింగ్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలను ఆమె ఆదివారం ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ చదరంగంలో శిక్షణ ఇస్తున్న మాదాసు కిషోర్ మరింత మందిని అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ అందించాలన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదా సు కిషోర్ మాట్లాడుతూ పోటీల్లో గెలుపొందిన కార్తీక్, ఎ.శరత్, కుష్వంత్, ఎ.అంజలి,డి. భవిష్య, సాన్వి, వాగ్దేవ్ విజేతలుగా నిలిచిరన్నారు. ఈ విజేతలు శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతిధ్యం వహిస్తారన్నారు. చెస్ అసోసియేషన్ సభ్యులు అల్లూరి శివరామరాజు, డీఎస్ఆర్ ఇంగ్లీషు మీడియం ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, ఆర్.శ్రీనివాసరావు, మురళి, అల్లు శ్రీనివాసులు పాల్గొన్నారు.



బొత్స దంపతులు అందించిన బంగారుపూత హనుమద్వాహనానికి పూజలు



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న రాష్ట్ర మంత్రి శ్రీనివాస్



దాత రామకృష్ణంరాజు కుటుంబానికి బాండు అందిస్తున్న ఈవో త్రినాథరావు

చినవెంకన్నకు హనుమద్వాహనం అందజేత

ద్వారకాతిరుమల, జూలై 21: చిన్నతిరుమలేశునికి మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ సతీమణి ఝాన్సీలక్ష్మి ఆదివారం బంగారు తాపడంతో తయారైన హనుమద్వాహనాన్ని ఆదివారం బహూకరించారు. విజయనగరానికి చెందిన బొత్స ఝాన్సీలక్ష్మి 230.500 కేజీల బరువున్న సుమారు రూ.32 లక్షలు విలువైన వాహనాన్ని కుటుంబంతో కలసి వచ్చి ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు సమక్షంలో అందించారు. తొలుత బొత్స దంపతులు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీవారికి మంత్రి శ్రీనివాస్ పూజలు

రాష్ట్ర మంత్రి హోదాలో చిన్న తిరుమలేశుని దర్శించుకోవడం పూర్వ పుణ్యఫలమని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ద్వారకాతిరుమల క్షేత్రానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు దేవస్థానం మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత ఆయన స్వామి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ డిప్యూటీ ఈవో బాబూరావు, ఏఈవో దుర్గారావు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. టీడీపీ నేతలు మొగతడకల శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, ఆర్.రాంబాబు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన ట్రస్టుకు రూ.4 లక్షల విరాళం

శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఓ దాత కుటుంబం రూ.4 లక్షలు విరాళంగా అందించారు. భీమవరం సమీపంలోని మందలపర్రుకు చెందిన పొట్టూరి నాగ రామకృష్ణంరాజు ఈ విరాళాన్ని నగదు రూపంలో ఆలయ కార్యాలయంలో ఆదివారం చెల్లించారు. ఈ సందర్భంగా దాత కుటుంబానికి ఆలయ ఈవో వి.త్రినాథరావు విరాళం బాండు పత్రాన్ని, అందించి శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి ఘనంగా సత్కరించారు.

బెంగాలీ కార్మికుడికి పాము కాటు



గిరిధర్ సర్దార్‌ను పరామర్శిస్తున్న సీపీఎం నేత కేతా గోపాలన్

పెనుగొండ, జూలై 21 : పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి పొట్ట చేత పట్టుకుని పొలం పనుల కోసం మన రాష్ట్రం వచ్చిన బెంగాలీ కార్మికుడు రక్త పింజరి అనే ప్రమాదకరమైన విష పాముకాటుకు ఆదివారం గురయ్యాడు. దేవ గ్రామంలో పంట చేను ఊడ్పుల కోసం ఆకుతీస్తున్న కార్మికుడి వేలిపై కాటు వేయంతో కార్మికుడు గిరిధర్ సర్ధార్‌ను పెనుగొండ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సందర్భంగా అతడిని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కేతా గోపాలన్ పరామర్శించి విషయం తెలుసుకున్నారు. కార్మికుడి వేలు రెండు అంగుళాలు విష ప్రభావంతో నల్లబడిందని అవసరమైన తక్షణ వైద్యం అందిస్తున్నామని వైద్యులు తెలిపారు. విష ప్రభావానికి మెదడు, మూత్ర పిండాలు దెబ్బతినవచ్చని రక్తపు వాంతులు అవుతాయన్నారు. శరీరంలోకి వెళ్లిన విష ప్రభావాన్ని అంచనా వేసి అవసరమైన వైద్య సహకారం కోసం ఇతర ఆసుపత్రులకు సూచిస్తామన్నారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ ఇటీవలే వడలి గ్రామ సమీపంలో పాము కాటుకు గురైన బెంగాలి కార్మికుడు మృతి చెందాడన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాము కాటుకు గురవుతున్న కార్మికులకు ఇన్సూరెన్స్ పథకం ప్రవేశపెట్టాలన్నారు. సీపీఎం నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, నాగిశెట్టి గంగారావు, చిలుకూరి శ్రీనివాసరావు ఉన్నారు.

కన్నడ సంగీత దర్శకుడు సతీష్‌బాబు మృతి

» పలువురి సంతాపం.. ఉండిలో విషాదచాయలు



సతీష్‌బాబు (ఫైల్)

ఉండి జూలై 21 : ఉండి గ్రామానికి చెందిన కన్నడ సంగీత దర్శకుడు గడి సతీష్‌బాబు(49) ఆదివారం ఉండిలోని ఇంటి వద్దే అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కన్నడ సినిమారంగంలో పలుచిత్రాలకు సంగీత దర్శకుడిగా పనిచేశారు. గత ఏడాది కాలం నుంచి అనారోగ్యం కారణంగా సినిమాలకు దూరంగా వున్నారు. స్వగ్రామమైన ఉండి విచ్చేసి ఇక్కడనే వైద్యం పొందుతున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు. భార్య, ఇరువురు కుమారులున్నారు. ఆయన మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయన తల్లి గడి జయలక్ష్మి మండల పరిషత్ మాజీ అధ్యక్షురాలు కావడంతో పలువురు రాజకీయ నాయకులు, అధికారులు ఆయనకు నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

వికసించిన బ్రహ్మ కమలాలు



బాలేపల్లిలో బ్రహ్మకమలాలు

వీరవాసరం, (భీమవరం టౌన్), జూలై 21 : వీరవాసరం మండలం బాలేపల్లి గ్రామంలో యర్రంశెట్టి వెంకటేశ్వరరావు (తాతాజీ) మాస్టార్ ఇంట్లో గురుపౌర్ణమి పర్వదినమున బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులుగా పిలువబడే మూడు బ్రహ్మకమలాలు వికసించాయి. ఈ పుష్పాలను గ్రామస్థులందరూ తిలకించి ఆనందిస్తున్నారు. ఈ బ్రహ్మకమలాలను 'కింగ్ ఆఫ్ హిమాలయన్ ఫ్లవర్' అని పిలుస్తారు. ఇటువంటి అరుదైన పుష్పం పవిత్రమైన గురుపౌర్ణమి రోజు తమఇంట్లో వికసించడం అదృష్టంగా భావిస్తున్నామని తాతాజీ మాస్టారు అన్నారు.

పదకొండు మంది జూదరుల అరెస్ట్

టి.నరసాపురం/నిడమర్రు, జూలై 21: టి.నరసాపురం, నిడమర్రు మండలాల్లో వేర్వేరుచోట్ల మొత్తం పదకొండు మంది జూదరులను అరెస్ట్ చేశామని పోలీసులు తెలిపారు. టి.నరసాపురం మండలం బండివారిగూడెం గ్రామ పంచాయతీలో పేకాటాడుతున్నట్టు సమాచారంతో సిబ్బందితో దాడి చేశామని ఎస్ఐ ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. దాడిలో ఏడుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.2,300 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. నిడమర్రు మండలం చానమిల్లి గ్రామంలో శనివారం రాత్రి పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామని నిడమర్రు ఎస్ఐ ఆర్.శ్రీను తెలిపారు. దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.30,600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం, జూలై 21 : నూజివీడు పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైందని నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు తెలిపారు. నూజివీడు పట్టణానికి చెందిన బాలిక కొద్దిరోజుల క్రితం జంగారెడ్డిగూడెం పట్టణంలో నివాసం ఉంటున్న తన నాయనమ్మ ఇంటికి వచ్చింది. శనివారం ఉదయం బయటికి వెళ్లిన బాలిక తిరిగి ఇంటికి చేరక పోవడంతో చుట్టుపక్కల వెతికినా ఆచూకీ కానరాలేదు. ఆదివారం నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

క్రైం కార్నర్

వృద్ధురాలిని తప్పించబోయి..

» ఆర్టీసీ బస్సును ఢీకొట్టి యువకుడి దుర్మరణం



సాయి కిశోర్ (ఫైల్)

పాలకొల్లు రూరల్, జూలై 21 : రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన పాలకొల్లులోని బ్రాడీపేట బైపాస్‌రోడ్డులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు, పట్టణ పోలీసులు తెలిపిన వివరాలివి.. మోటారుసైకిల్‌పై పాలకొల్లులోని తన పెదనాన్న ఇంటికి వెళ్లి వస్తున్న యాదల సాయి కిశోర్(21) ఒక వృద్ధు రాలిని తప్పించబోయి ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ఢీ కొన డంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని స్థానిక ప్రభు త్వాసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణిం చినట్టు పట్టణ ఏఎస్ఐ ఏసుబాబు తెలిపారు. మృతుడు సాయికిశోర్ తండ్రి నరేష్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ తెలిపారు.

మామను హత్య చేసిన అల్లుడి అరెస్ట్

ద్వారకాతిరుమల, జూలై 21 : మామను హత్య చేసిన అల్లుడిని 24 గంటలు గడువక ముందే పోలీసులు అరెస్ట్ చేసి కటకటాల వెనక్కిపంపారు. ఏలూరు డీఎస్పీ ఈ శ్రీనివాసులు ఆధ్వర్యంలో భీమడోలు సీఐ బి.రవికుమార్ కేసును ఛేదించి ముద్దాయిని అతడి స్వగ్రామమైన జి.కొత్తపల్లిలో ఆదివారం మధ్యాహ్నం వలపన్ని పట్టుకున్నారు. సీఐ తెలిపిన వివరాలివి.. ఐఎస్ జగన్నాథపురానికి చెందిన పాతకోకుల లాజర్(65) పెద్ద కుమార్తె గంగాభవానీని జి.కొత్తపల్లికి చెందిన సుబ్బారావుకిచ్చి పెళ్లి చేశారు. అల్లుడు వ్యసనాలకు బానిసై తన ఇద్దరు పిల్లలను భార్యను తరచూ హింసించడంతో భార్య పుట్టింటికి వెళ్లి తండ్రి వద్దే కూలిపనులు చేసుకుంటూ ఉంది. రెండు నెలల క్రితమే ఆమె తన కుమార్తెకు పెళ్లి చేసింది. కుటంబపోషణ కష్టం కావడంతో కువైట్ వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంది. ఈ రెండూ తనకు తెలియకుండా జరగడంతో అహం దెబ్బతిన్న సుబ్బారావు భార్యను చంపేందుకు అత్తారింటికి వెళ్లి.. భార్య లేకపోవడంతో మామ లాజర్‌ను విచక్షణరహితంగా దాడి చేయడంతో మృతి చెందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు పరారైన అల్లుడు సుబ్బారావును 24 గంటలు గడవక ముందే సీఐ రవికుమార్ వలపన్ని పట్టుకున్నారు. కేసును సత్వరం ఛేదించిన పోలీసు అధికారులను ఎస్పీ ప్రతాప్ శివకిషోర్ అభినందించారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

» రెండు లక్షలు నగదు, ఐదు కాసుల బంగారం అపహరణ

జంగారెడ్డిగూడెం, జూలై 21 : జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఓ ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి నగదు, బంగారం దోచుకుపోయిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జంగారెడ్డిగూడెం ఎస్ఐ జ్యోతిబసు తెలిపిన వివరాలివి.. పట్టణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్‌లో అడ్డూరి లోవరాజు అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ స్థానిక త్రివేణి కళాశాల వద్ద నివాసం ఉంటున్నాడు. ఈనెల 19వ తేదీన లోవరాజు తన భార్యతో కలసి అపార్ట్‌మెంట్ వద్దకు కాపలా నిమిత్తం వెళ్లి తిరిగి అదే రోజు రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లగా బీరువాలోని రూ.2లక్షలు నగదు, ఐదు కాసుల బంగారు ఆభరణాలు తస్కరించినట్టు గుర్తించారు. ఆదివారం బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

10 కేజీల వెండి వస్తువుల చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణకుమార్

కైకలూరు, జూలై 21: కైకలూరు ఎన్జీవోస్ కాలనీలో పది కేజీల వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు ఆదివారం గుర్తించారు. గ్రామానికి చెందిన పాలచర్ల సత్యన్నారాయణ చౌదరి కుమార్తె అమెరికాలో ఉండడంతో కొద్దిరోజుల క్రితం ఆయన అమెరికా వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండడంతో దుండగులు తాళాలు పగులగొట్టి బీరువాలోని సుమారు పది కేజీల వెండి వస్తువులను చోరీ చేశారు. రెండు రోజుల్లో సత్యనారాయణ చౌదరి కైకలూరు వస్తున్నారనే సమాచారంతో పనిమనిషి ఇంటిని శుభ్రం చేసేందుకు ఆదివారం వెళ్లగా తాళాలు పగలగొట్టి ఉండడాన్ని గమనించి వారి సోదరుడు ఏతా శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయగా కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, టౌన్ ఎస్ఐ రాజు సంఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. క్లూస్ టీం ద్వారా ఆధారాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





భీమవరంలో శారదాదేవి, గోగులమ్మ, పాలకొల్లులో పార్వతీదేవిలకు శాకంబరి అలంకారం

అమ్మవార్లకు శాకంబరి అలంకారాలు

భీమవరం టౌన్, జూలై 21 : ఆషాఢ పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని రెస్ట్‌హౌస్ రోడ్డులోని శంకరమఠంలో అమ్మవారికి శాకంబరిగా అలంకరణ చేశారు. మోటుపల్లి వారి వీధిలోని గోగులమ్మ వారికి శాకంబరిగా అలంకారం చేశారు. మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అమ్మవారికి పూజలు చేసుకున్నారు. ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఆదివారం భక్తుల ఇలవేల్పు మావుళ్ళమ్మ అమ్మవారు భక్తులకు శాకంబరి దేవిగా అలంకరణలో దర్శనం ఇచ్చారు. సుమారు 5 టన్నుల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలతో అమ్మవారితోపాటు ఆలయ ప్రాంగణమంతా అలంకరణ చేశారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి స్వర్ణ వస్త్రానికి పెదపుల్లేరుకు చెందిన కలిదిండి రవి రాజు, నీలిమ దంపతులు 8 గ్రామాల బంగారాన్ని ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా ఆలయ ఈవోకు అందించారు. 50 మంది దంపతులచే చండి హోమం నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, పారిశ్రామిక వేత్త యిర్రింకి సూర్యా రావు, పొత్తూరి బాపిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: శ్రీక్షీరా రామలింగేశ్వరస్వామి ఆలయంలోని శ్రీ పార్వతీ దేవిని శాకంబరి దేవిగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయలతో అలంకరించిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు.

ఎమ్మెల్యే దృష్టికి ఆశా వర్కర్ల సమస్యలు



ఎమ్మెల్యే నాయకర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆశవర్కర్లు

నరసాపురం టౌన్, జూలై 21: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నాయకర్ హామీ ఇచ్చారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో మొగల్తూరు, నరసాపురంకు చెందిన ఆశవర్కర్లు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిశారు. గత ప్రభుత్వం హామీలిచ్చిందే తప్ప ఒక్కటి కూడా అమలు చేయలేదని వాపోయారు. కనీస వేతనం రూ. 26వేలతో పాటు ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

ముంపు బాధితులకు ఆహార పొట్లాలు

భీమవరం టౌన్, జూలై 21: భీమవరం మెంటేవారి తోటలోని 2వ వార్డు 38,39వ వార్డుల్లోని ముంపు ప్రమాద బాధితులకు శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆహార పొట్లాలను ఎమ్మెల్యే అంజిబాబు చేతుల మీదుగా అందించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ స్వర్గీయ కనుమూరు వెంకట నరసమ్మ జ్ఞాపకార్థం వారి కుమారులు కనుమూరు రామకృష్ణంరాజు, గోపాలరాజు సౌజన్యంతో 200 మంది ముంపు బాధితులకు ఆహార పొట్లాలు, లక్కు సురేష్ సౌజన్యంతో దుర్గపురంలోని రెండు వార్డు లోని 80మందికి ఆహార పొట్లాలను అందించామని తెలిపారు. కమిషనర్ శ్యామల, వీఆర్వో శ్యామ్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తిభావంతో మెలగాలి

భీమవరం టౌన్, జూలై 21 : ప్రతి ఒక్కరు భక్తి భావంతో మెలగాలని, అప్పుడే సమాజ అభివృద్ధి జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆషాఢ మాసం గురు పౌర్ణమిని పురస్కరించుకుని పట్టణంలోని 20వ వార్డులోశ్రీ మావుళ్ళమ్మ 9వ వార్షిక జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రారంభించారు. గ్రంధి రవితేజ పాల్గొన్నారు. టిడ్కో గృహాలు వద్ద శ్రీ ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి పోలేరమ్మ అమ్మవార్ల జాతరలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు జరిపారు.

సమస్యలు పరిష్కరించాలని పితానికి వినతి



ఎమ్మెల్యే పితానిని సన్మానిస్తున్న కాలనీ వాసులు

పెనుగొండ, జూలై 21: పెనుగొండ గ్రామంలోని కోడిపందాల దిబ్బ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసులు పట్టణ టీడీపీ నాయకులు వేంద్ర రాము ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన వీధి లైట్లు వేయించాలని, తాగు నీటి సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌కు ఆదేశాలు ఇచ్చారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా ఇంటింటికి కుళాయి కనెక్షన్‌లు వేయించడానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. భూగర్భ డ్రెయినేజీ తో కూడిన సీసీ రహదారులకు ప్రతిపాదనలు సిద్ధం చేయమని అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే పితానిని సత్కరించారు.

పారుపల్లి అమ్మవారికి సారె

పెంటపాడు, జూలై 21: జట్లపాలెంలో పారుపల్లి అమ్మవారికి గ్రామస్థులు ఆషాఢ సారె సమర్పించారు. మహిళలు పెద్దఎత్తున మేళతాళాలతో ఊరేగింపుగా వెళ్ళి అమ్మవారికి సారె, చీరలు సమర్పించారు. అనంతరం అన్నసమారాధన జరిగింది.

థియోసాఫికల్ సమావేశాలకు రామచంద్రరావు



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21: కెనడాలో 2025 జూలై 23 నుంచి జరగనున్న థియోసాఫికల్ సొసైటీ ప్రపంచ కాంగ్రెస్ సమావేశాల్లో పాల్గొనేందుకు తనను ఎంపిక చేసినట్టు తాడేపల్లిగూడెంకు చెందిన కర్రి రామచంద్రరావు తెలిపారు. థియోసాఫికల్ సొసైటీని తెలుగులో దివ్యజ్ఞాన సమాజం పేరుతో వారణాసి రాజధానిగా నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటూ 25 ఏళ్లుగా ఈ సమాజానికి సంబంధించిన తత్వాన్ని అధ్యయనం చేస్తున్నందున ఈ అవకాశం లభించినట్టు వివరించారు. రామచంద్రరావు ప్రస్తుతం నేషనల్ ఇండియన్ కౌన్సిల్ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



తాడేపల్లిగూడెం రూరల్, జూలై 21: వారంతా కలసి డిగ్రీ పూర్తిచేసి నాలుగున్నర దశాబ్దాలైంది. నిడదవోలు వెలగపూడి రామకృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1977-80 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం తాడేపల్లిగూడెంలోని ఒక ఇంజనీరింగ్ కళాశాలలో కలుసుకుని నాడు తమ స్నేహితులతో కలిసి చేసిన అల్లరిని గుర్తుచేసుకుంటూ చిన్నపిల్లలైపోయారు. బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ ఆ బ్యాచ్ విద్యార్థే. రిటైర్మెంట్ అనంతరం కలవడం తమ ఆనందాన్ని రెట్టింపు చేసిందని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు.

పంట కాల్వలోకి యనమదుర్రు వరద నీరు

ఉండి జూలై 21: ఉండి పంటకాల్వలో నుంచి యనమదుర్రు డ్రెయిన్‌లోకి వెళ్ళ వలసిన నీరు అందుకు భిన్నంగా యనమదుర్రు డ్రెయిన్ నీరు సర్‌ప్లస్ వియ్యర్ చానల్ ద్వారా ఉండి పంట కాల్వలోకి ఉధృతంగా వస్తున్నది. సర్‌ప్లస్ వియ్యర్ చానల్‌లోకి బాగా వేగంగా నీరు వస్తుండడంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. యనమదుర్రు డ్రెయిన్ నుంచి వరదనీరు ఉండి పంటకాలువలోకి చేరడంతో నీటి ప్రవాహం కాలువ గట్లకు సమాంతరంగా ప్రవహిస్తున్నది. దాంతో బలహీనంగా వున్న పలుచోట్ల గట్లు కోతకు గురి అవుతున్నాయి. యండగండి వద్ద జగనన్న కాలనీ, తిమ్మరాజు కాలనీలలో వర్షపునీరు చేరింది. ఆయా కాలనీలు వద్ద అధికారులు ఇసుకబస్తాలను అడ్డుకట్టగా వేశారు. యండగండిలోని గొల్లలువీధి నుంచి వరదనీరు ఉధృతంగా శివాలయం వరకు చేరింది. యండగండి లాకుల గేట్లు వద్ద గోడలు పైనుంచి నీరు ప్రవహిస్తుంది.

ఇంటింటా వైద్య సేవలు

తణుకు, జూలై 21: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సంచార శకటం ద్వారా డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి 9 మందికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యులు ఎం. రవి రెజినాల్డ్ ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ కోశాధికారి అర్ధి భాస్కరరావు, సభ్యుడు గిరజాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






బాడవలో గోదావరి వరదను పరిశీలిస్తున్న ఆర్డీవో అచ్యుత అంబరీష్... భీమవరం మెంటేవారితోటలో ఇళ్ల వద్దకు చేరిన వరద నీరు.. మోగల్లులో నీటిలో మునిగిన సబ్ స్టేషన్.. రావిపాడులో నీట మునిగిన వరి పొలాలు

వర్షం తగ్గినా... వీడని ముంపు

చెరువుల్ని తలపిస్తున్న చేలు... రహదారులు.. ఉధృతంగా డ్రెయిన్లు




పిప్పరలో ముంపులో ఉన్న వరి పైరును ఎమ్మెల్యే ధర్మరాజుకు చూపుతున్న రైతు... ఇరగవరం మండలంలో నీట మునిగిన వరిపైరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

నరసాపురం రూరల్, జూలై 21: ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదివారం కొంతమేర బ్రేక్ పడింది. ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమైన సాయంత్రం వరకు వర్షం పడలేదు. దీంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. అయితే చేలలో నీరు మాత్రం తగ్గలేదు. డ్రెయినేజీలన్ని నిండుకుండలా ఉండటంతో పంట పొలాల్లోని నీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయింది. సరిపల్లి, రుస్తుంబాదా, సీతారాంపురం, వేములదీవి, మల్లవరం, వైఎస్‌పాలెం గ్రామాల్లో పంట చేలు చెరువుల్ని తలపిస్తున్నాయి. లోతట్టు ప్రాంతంలోని చేలల్లో రెండు అడుగుల మేర నిలిచింది.

ఆచంట: గోదావరి ప్రవాహం రోజు రోజుకు పెరుగుతున్న కారణంగా అధికారులు అప్రమత్తంగా ఉండి వరద పరిస్థితిని పర్యవేక్షిస్తుండాలని నరసాపురం ఆర్‌డీవో అచ్యుత అంబరీష్ అన్నారు. ఆదివారం కోడేరు వద్ద వరద పరిస్థితిని ఆర్‌డీవో పరిశీలించారు. గోదావరి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఎటువంటి భయాందోళన చెందకుండా ఉండేదుకు గాను అధికారులు నిరంతరం వరద పరిస్థితిని సమీక్షిస్తుండాలని ఆదేశించారు. ఆర్‌డీఓ వెంట తహసీల్దార్ ఐవీశెట్టి తదితరులు పాల్గొన్నారు. వర్షాలు కారణంగా మండలంలో పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఆదివారం కూడా తరచూ జోరు వాన పడుతూనే ఉంది. అనేక పల్లపు ప్రాంతాలు నీటిలోనే ఉన్నాయి. నాట్లు కుళ్ళిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆచంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో భారీ వర్షాలు కారణంగా నీట మునగడంతో కొంత మందిచిన్నారులు, యువకులు ఆ నీటిలో కేరింతలు కొట్టారు. మండలంలో ఉన్న మురుగు డ్రెయిన్‌లు ఇంకా పొంగి పొర్లుతున్నాయి.

పాలకోడేరు: గోస్తని నది పొంగటంతో మోగల్లు గ్రామంలోని సబ్‌స్టేషన్ నీటిలో మునగటంతో విద్యుత్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అదే విధంగా గోస్తని నది వేగంగా ప్రవహిస్తుండటంతో పాలకోడేరును ఆనుకుని ఉన్న గోస్తని నదిగట్టు బలహీనం కావడంతో పాలకోడేరు గ్రామంలోని కూటమి పార్టీ నాయకులు అప్రమత్తమై గట్టును బలపరిచేందుకు సంసిద్ధులయ్యారు.

పెంటపాడు: మండలంలోని దర్శిపర్రు, బి.కొండేపాడు, మీనవల్లూరు, పరిమెళ్ళ, ఆకుతీగపాడు, యానాలపల్లి తదితర గ్రామాల్లో పొలాలు ఇంకా ముంపులోనే కొనసాగుతున్నాయి. మరో పక్క యనమదుర్రు డ్రెయిన్ ఉధృతంగా ప్రవహించడంతో సమీపంలోని బి.కొండేపాడు, మీనవల్లూరు, రామచంద్రపురం గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రామచంద్రపురం జగనన్న కాలనీ ఇంకా ముంపులోనే ఉంది. కాలువ నీరు కాలనీ మొత్తం చుట్టేయడంతో పాములు చేరుతున్నాయని, తమకు ఎప్పుడు ఎలాంటి అపాయం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లంక గ్రామాలు అప్రమత్తంగా ఉండాలి

యలమంచిలి, జులై 21: గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో యం.అచ్యుత అంబరీష్ అన్నారు. బాడవ గ్రామంలో పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ గోదావరి వరద ధవళేశ్వరం వద్ద ఆదివారం సాయంత్రానికి 9.9అడుగుల నీటి మట్టం ఉండటంతో మొదటి ప్రమాద హెచ్చరికకు సమీపంలో ఉన్నామని.. రానున్న మూడు రోజుల్లో వర్షాలు అధికంగా పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వరద ఉధృతి క్రమేపి పెరుగుతోందని లంక గ్రామాల, లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదప్రభావిత ప్రాంతాల్లో అన్ని ముందస్తు చర్యలు చేపట్టామని అన్నారు. మొదటగా ముంపుబారిన పడే గ్రామాలైన కనకాయలంక, పెదలంక, బాడవ గ్రామాల్లో బియ్యంతోపాటూ పామాయిల్, కందిపప్పు ఇప్పటికే అందుబాటులో ఉంచామని తెలిపారు. అన్ని లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు, పడవలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కనకాయలంక కాజ్ వే వద్ద వరద పరిస్థితిని తహసీల్దారు సిహెచ్.విజయశ్రీ పరిశీలించారు. తక్షణమే గ్రామస్తులు రాకపోకలు సాగించేందుకు పడవలను ఏర్పాటుచేయాలని సిబ్బందికి సూచించారు.

రైతులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం, జూలై 21: భారీ వర్షాలకు, యనమదుర్రు వరదలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు తెలిపారు. ఆదివారం అధికారులతో కలిసి పిప్పర, కోమర్రు, డీకే.వల్లి, మొయ్యేరు, ఎస్.కొండేపాడు, కేశవరం గ్రామాల్లో నీటమునిగిన వరి చేలను, విద్యుత్ సబ్‌స్టేషన్ ఏరియా, కాలనీలో ముంపునకు గురైన ప్రాంతాలను ఆయన పరిశీలించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో జరుగుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ఎస్.కొండేపాడు వద్ద యనమదుర్రు వరదల్లో మునిగిన వంతెనను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ వంతెన స్థానంలో నిర్మించిన నూతన వంతెనను ఉపయోగంలోకి తీసుకొచ్చేందుకు శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామాల్లోకి వరదనీరు చొచ్చుకుపోకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని ఆదేశించారు. కోమర్రులో యనమదుర్రు వరద బాధితులు 13 మంది కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, అడ్డేపల్లి వాసురాజు, యాళ్ల సుబ్బారావు, జనసేన నాయకుడు పొత్తూరి వాసురాజు, వంగా రఘు, తోట శ్రీనివాసరావు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ తప్పిదాల వల్లే వెతలు : ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఇరగవరం, జూలై 21 : వైసీపీ ప్రభుత్వ తప్పిదాల వల్ల ఇటు ప్రజలతో పాటు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఇరగవరం, అర్జునుడుపాలెం, కంతేరు, కాకిలేరు, పేకేరు గ్రామాల్లో నీట మునిగిన పొలాలను ఆయన ఆదివారం పరిశీలించారు. పంట నష్టం వివరాలను రైతులను అడిగి తెలుసుకుని ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వం రీ సిల్టింగ్ పనులు చేయకపోవడంతో డ్రైనేజీలు నిండి పొలాలలోకి నీరు చేరుతోందన్నారు. రాబోయే వేసవిలో రీ సిల్టింగ్ చేపడతామని తెలిపారు. అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యనమదుర్రు ఉగ్రరూపం

ఉండి జూలై 21: యనమదుర్రు డ్రెయిన్ ఉగ్ర రూపం దాల్చింది. వరదనీరు పరవళ్ల తొక్కుతు న్నది. భారీవర్షాలు కారణంగా పైప్రాంతం నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. దాంతో యం డగండి వద్ద యనమదుర్రు డ్రెయిన్ గరగపర్రు మీదగా భీమవరంకు వేగంగా ప్రవహిస్తోంది. యండగండి నుంచి షైపకు వెళ్లే మార్గంలో పెద్దవంతెన వద్ద ప్రజలు తండోపతండాలుగా విచ్చేసి వరదను తిలకిస్తున్నారు. యండగండి- ఎస్‌కొండేపాటు వద్ద వరదనీరు ఉరకలు వేస్తూ ప్రవహిస్తోంది. ఆయా గట్లు వెంబడి ఇసుక బస్తాల ను అడ్డుకట్టలుగా వేశారు. అధికారులు, ప్రజలు గస్తీ తిరుగుతున్నారు. యండగండి వద్ద యనమ దుర్రు డ్రెయిన్ ఉధృతిని, ఉండి పంట కాలువ యండగండి లాకులు, సర్‌ప్లస్‌వియ్యర్ చానల్ నుంచి వెనక్కి వస్తున్న వరదనీరును మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధ్‌రాజు పరిశీలిం చారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

అత్తిలి: నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు భారీ గా వచ్చి చేరడంతో యనమదుర్రు డ్రెయిన్ ఉధృ తంగా ప్రవహిస్తోంది. ఆదివారం రామచంద్రాపురం వద్ద ఉన్న ఆరుదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద గట్లను తాకుతూ ప్రవహించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. స్లూయిజ్ వద్ద గట్టు బలహీనంగా ఉండడంతో అధికార యంత్రాంగం ఇప్పటికే ఇసుక బస్తాలతో పటిష్టం చేశారు. అత్తిలి మండలంలో గల ప్రధాన డ్రెయిన్ల యిన రాచకోడు, ఈర్లకోడు, మంచిలి, ఆరుదలకోడు డ్రెయిన్ల ఉధృతికి వరి నాట్లు, నారుమడులు నీటి ముంపులో ఉన్నాయి. యనమదుర్రు డ్రెయిన్ ఉధృ తి తగ్గే వరకు పంట చేలు ముంపులోనే ఉండే పరిస్థితి నెలకొంది. ఆరుదలకోడు అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లు మూసివేసినప్పటికీ గేట్లు సరిగా పనిచేయకపోవడంతో యనమదుర్రు డ్రెయిన్ వరదనీరు ఆరుదలకోడు అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్ల కింద నుంచి వెనక్కి ఎగదన్నడంతో చేలల్లోకి ఎర్రనీరు చేరి సముద్రాన్ని తలపిస్తోంది.

భీమవరం టౌన్: యనమదుర్రుకు వరదనీటి తాకిడి పెరగటంతో డ్రెయిన్ పరీవాహక ప్రాంతాల్లోకి నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. లంకపేట, దుర్గాపురం, మెంటే వారితోట ప్రాంతాలల్లో ప్రజలను తరలించారు. వారికి కావలసిన సౌకర్యాలను మునిసిపల్ కమిషనర్ ఎం శ్యామల ఏర్పాటు చేస్తున్నారు. ఆదే విధంగా పట్టణంలోని మురుగును డ్రెయిన్‌లోకి పంపే చోట్ల షట్టర్లను మూసివెయ్యటంతో ఆ ప్రాంతాలల్లో ఇంజనీరింగ్ అధికారులు మోటార్లుపెట్టి నీటిని యనమదుర్రు డ్రెయిలోకి పంపుతున్నారు.



అత్తిలి మండలం ఆరుదలకోడు అవుట్ ఫాల్ స్లూయిజ్ వద్ద గట్టుపై ఇసుక బస్తాలు వేసిన దృశ్యం

గోస్తనీనది, పంట కాల్వలకు గండి

పాలకోడేరు: మోగల్లు శివారు గుత్తులవారిపాలెంలో గోస్తనీనదికి గండి పండింది. దీనితో చెంచుల కాలనీ, కొత్తకాలనీ జలదిగ్బంధంలో ఉన్నాయి. వందలాది ఎకరాలు ముంపునకు గురయ్యాయి. గొల్లలకోడేరులోని ఉండి పంటకాల్వకు చిన్నగండి పడింది. స్థానికులు ప్రమాదం జరగకుండా చర్యలు చేపట్టడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.





భీమవరంలో సాయి బాబాకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు, ఆలయ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు.. పెంటపాడులో బాబాకు ఎమ్మెల్యే బొలిశెట్టి పూజలు.. పాలంగిలో సాయిబాబా వ్రతాలు

గురు పౌర్ణమి పూజలు

భీమవరం టౌన్, జూలై 21 : గురు భగవానుడిని, వ్యాస మహర్షిని పూజించే వారికి అష్టైశ్వర్యాలు కలుగుతాయని, అందుకే గురుపౌర్ణమినాడు గురువులను నమస్కరించి పూజించుకోవాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీలో శ్రీవెంకట సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త, చైర్మన్ మల్లినిడి తిరుమలరావు ఆధ్వర్యంలో బాబావారికి ఆవుపాలతో అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని బాబా వారిని దర్శించుకొని విశేష పుష్పార్చన నిర్వహించారు. జనసేన పట్టణ అధ్యక్షుడు చెన్నమల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, ఏఎంసి మాజీ చైర్మన్ కోళ్ల నాగేశ్వరరావు, భీమాల శ్రీరామ్మూర్తి, మల్లినీడి సుధాకర్, కంతేటి వెంకటరాజు, బాల, సిహెచ్ ప్రసాద్ రత్నాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆకివీడు: గురుపౌర్ణమి సందర్భంగా అజ్జమూరు, అయి-భీమవరం, కుప్పనపూడి, గుమ్ములూరు, చినకాపవరం, పెదకాపవరం, ఆకివీడు తదితర చోట్ల సాయిబాబా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి హారతులు తీసుకున్నారు. అనంతరం ఆయా ఆలయాల్లో పల్లకీలు మోసి భోజన ప్రసాదం స్వీకరించారు.

ఉండి: గురుపౌర్ణమి సందర్భంగా శ్రీలక్ష్మీగణపతి దత్తసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని శ్రీలక్ష్మీఅమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ చేశారు. దాతలను జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. అఖండ అన్నసమారాధన జరిగింది.

మొగల్తూరు: రామన్నపాలెం, మొగల్తూరు, లక్కువారితోట, పేరుపాలెం కనకదుర్గాబీచ్, కెపిపాలెం గ్రామాల్లోని బాబా ఆలయాల్లో వేకువ జాము నుంచి భక్తులు బాబా దర్శనానికి తరలివచ్చారు. మొగల్తూరు రామాలయం వీధిలో గల బాబా ఆలయంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

ఆచంట: మండలంలో ఆచంట,పెదమల్లం, వల్లూరు, కొడమంచిలి, పెనుమంచిలి, బాబా ఆలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు వేడుకగా జరిగాయి. పలు చోట్ల పెద్ద ఎత్తున అన్నసమారాధనలు నిర్వహించారు.

గణపవరం: వాకపల్లిలో ఆదివారం కృష్ణా జిల్లా శ్రీకృష్ణ ఆశ్రమం పీఠాధిపతి గౌరా కృష్ణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. మహిళలచే ప్రత్యేకపూజలు, హనుమాన్‌చాలీసా పారాయణం జరిగాయి. నంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గణపవరం, సరిపల్లె, అర్ధవరం, పిప్పర, కేశవరం, జల్లికాకినాడ, మల్లపురాజుపేటలో షిరిడి సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి పూజలు నిర్వహించారు.

కాళ్ల(ఉండి): సీసలి సాయిబాబా ఆలయంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ తోట అనంతలక్ష్మీ సత్యవతిదేవి ఆధ్వర్యంలో 3వేల కలశాలతో అభిషేకాలు, 6వేల లీటర్లు ఆవుపాలు, 7లక్షల రూపాయల నాణేలతో సాయిబాబాకు అభిషేకాలు నిర్వహించినట్లు తెలిపారు. అన్నసమారాధన నిర్వహించారు.

పెంటపాడు: పెంటపాడు ఊర చెరువు వద్ద వరసిద్ధి షిరిడీ సాయిబాబాకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేయగా ఆయనను ఆలయ కమిటీ అధ్యక్షుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి సత్కరించారు. ఆలయ ప్రాంగణం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అలంపురం షిరిడీసాయిబాబా ఆలయంలో ట్రస్టు చైర్మన్ కొలనువాడ పెద్దకృష్ణంరాజు ఆధ్వర్యంలో పూజల అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది.

అమ్మవార్లకు ఆషాఢ సారెలు

ఆకివీడు, జూలై 21 : దేవతలకు ఆషాఢమాస సారెలు భక్తులు ఆదివారం పలుచోట్ల అందచేశారు. స్థానిక పెద్దింట్లమ్మ, మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి దేవస్థానాల్లో లలితా మహిళామండలి మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాఢమాస సారెలు సమర్పించారు. కార్యక్రమంలో గుర్రం రాజా, సన్నిధి వెంకన్నబాబు తదితరులు ఉన్నారు.

మారెమ్మకు బోనాలు



ఆకివీడు, జూలై 21 : మారెమ్మకు తెలగపాముల కులస్థులు ఆదివారం బోనాలు సమర్పించారు. ప్రతీ ఏడాది ఆషాఢమాసంలో గంగానమ్మకోడ్ ప్రాంతంలో ఉన్న మారెమ్మకు బోనాలు సమర్పిస్తారు. తెలగపాముల కులస్థులు తమ గూడెం నుంచి బోనాలు నెత్తిమీద పెట్టుకొని స్థానిక వెంకటలింగేశ్వరస్వామి, వనువులమ్మ దేవస్థానాలకు మేళతాళాలతో వెళ్ళి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం గూడెంకు చేరుకొని మారెమ్మ దేవాలయానికి ప్రదర్శనలు చేసి బోనాలు సమర్పించారు.

గొల్లలకోడేరులో మునక

పాలకోడేరు, జూలై 21: కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గొల్లలకోడేరు గ్రామంలోని 1వ వార్డు పూర్తిగా మునిగిపోయింది. డ్రెయిన్లు, రోడ్లు ఏకం కావడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇది గుర్తించిన గ్రామ టీడీపీ అధ్యక్షుడు కమ్మిలి రాంబాబు మురుగుబోదెల ప్రక్షాళన పనులకు ఆదివారం గ్రామ సర్పంచ్ కుక్కల లక్ష్మీతో కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. గ్రామంలోని ప్రధాన మురుగు కాల్వ ఆక్రమణలతో పూడుకుపోవడంతో 1వ వార్డు మొత్తం మురుగువెళ్ళే దారి లేక మునిగిపోయింది. ఎక్స్‌కవేటర్‌తో ఆక్రమణలు తొలగించి మురుగువెళ్ళే మార్గాన్ని సరిచేశారు. ఈ పనులు మరో రెండు రోజుల పాటు సాగనున్నాయని ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఆరిమిల్లి

తణుకు, జూలై 21: విద్యుదాఘాతంతో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబాన్ని ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. ఆదివారం మృతుడు శ్రీను కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ శాఖ నుంచి వచ్చే పది లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు టీడీపీ తరఫున రూ. 50 వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్టు పేర్కొన్నారు. ఇంటి స్థలంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు.

విద్యార్థికి మానవత ఆర్థిక సాయం

తణుకు, జూలై 21: మండపాకకు చెందిన యాళ్ళ రాజు కుమార్తె హర్షిణి చదువు కోసం మానవత సంస్థ తరఫున రూ. 15 వేలు ఆర్థిక సాయాన్ని ఆదివారం అందజేశారు. హర్షిణి రాజ్‌కోట్‌లోని వర్సిటీలో బీకాం డిజిటల్ ఫైనాన్స్ కోర్సు మెరిట్ కోటాలో చదువుతోందన్నారు. సంస్థ అధ్యక్షురాలు కటారి శారదాదేవి, జిల్లా శాంతి ర్యాలి కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి, సతీష్ బాబు, కరుణాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకార సంఘ ఎన్నికల నామినేషన్లు



తణుకు, జూలై 21: ఈ నెల 28న జరిగే తణుకు పట్టణ స్వర్ణకార సంఘ ఎన్నికలకు నలుగురు అభ్యర్థులు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల అధికారులుగా జిల్లా అధ్యక్షుడు పట్నాల శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి నల్లగొండ రామకృష్ణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు

పాలకొల్లు అర్బన్, జూలై 21: వీవర్స్ కాలనీలోని వీవర్స్‌కమ్యూనిటీ భవనంలో ఆదివారం జిల్లా దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సంఘ అధ్యక్షుడు వట్టం గణేష్ ప్రారంభించారు. డాక్టర్ యాతం లక్ష్మీశ్రీరంగ, గుండె వ్యాధి నిపుణులు డాక్టర్ ఆర్ రవి కుమార్ బీపీ, షుగర్, ఈసీజీ వైద్య పరీక్షలు చేశారు.

చండీ హోమం

పాలకొల్లు అర్బన్, జూలై 21: శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారి ఆలయంలో జ్యేష్ఠ మాసం పౌర్ణమి సందర్భంగా ఆదివారం చండీహోమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, 29మంది దంపతులు చండీ యాగంలో పాల్గొన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా స్వామివారి ఆలయంలో డాక్టర్ నంబూరి భాగ్యలక్ష్మీ ఆధ్వర్యంలో సామూహికంగా లలితా సహస్ర నామ పారాయణలు, కుంకుమ పూజలు చేశారు.

లోక కళ్యాణార్థం సూర్యహోమం

పాలకొల్లు అర్బన్, జూలై 21 : లోక కళ్యాణార్థం స్థానిక కోడిగట్టున ఉన్న శ్రీసరస్వతి శిశు మందిరంలో ఆదివారం 217వ వారం సూర్యహోమం నిర్వహించారు. కరోనా ప్రారంభం అయినప్పటి నుంచి ప్రతీ ఆదివారం నిర్వహించే ఈ సూర్యహోమం 217వ సూర్యహోమం అని నిర్వాహకులు తెలిపారు. వేదపండితులు సూర్య నమస్కారాలు, శాంతి హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బండి ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

మొగల్తూరు, జూలై 21: తీర ప్రాంత ప్రజల ఆరాధ్యదేవత ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, తూర్పుగోదావరి జిల్లా మురమళ్ళ వీరేశ్వర స్వామి ఆలయ గ్రేడ్ 1 ఈవో మాచిరాజు లక్ష్మీనారాయణలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి తిథి కావడంతో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఫైర్ సర్వీస్ కానిస్టేబుల్ రమణకు అభినందన



పాలకొల్లు అర్బన్, జూలై 21 : ఉద్యోగం చిన్నది అయినా తనకు వచ్చే దానిలో కొంత భాగం తన స్వగ్రామంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని నరసాపురం సబ్ కలెక్టర్ డాక్టర్ ఎంఏ అంబరీష్ అన్నారు. స్థానిక ఫైర్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బీవీ రమణను అభినందించారు. రమణ గురువు అయిన పీతల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ రమణ స్వగ్రామం పెనుగొండ మండలం ములపర్రులో బీవీ రమణ చారిటబుల్ ట్రస్ట్ పేరుతో శ్రీకృష్ణ సాయి సేవా సమితి ద్వారా గ్రామంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారన్నారు. త్వరలో 100 మంది ఉండే విధంగా అనాధ ఆశ్రమం నిర్మాణం, 200మంది పేద విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేయడానికి రమణ కృషి చేస్తున్నరని తెలిపారు. ఈసందర్భంగా రమణను సబ్ కలెక్టర్ అంబరీష్ ఘనంగా సత్కరించారు.

అఘోరాలు ప్రజల మంచి కోరతారు



తణుకు, జూలై 21: అఘోరాలు ప్రజలు మంచి కోరతారని అఖిల భారత అఘోర అఖాడా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌నాథ్‌జీ అన్నారు. ఆదివారం తణుకు కమ్మ కల్యాణ మండపంలో అఖాడా ఆధ్వర్యంలో గురుపూజోత్సం నిర్వహించారు. సంస్థాపక్ అధ్యక్షుడు డాక్టర్ ఆదేశ్ నాదేజీ అఘోరి, ఉత్తరాధికారి విక్రాంత్‌నాథ్‌జీ అఘోరికి శిష్య బృందం గురుపూజోత్సవం సందర్భంగా పాదపూజ నిర్వహించారు. శిష్యులకు గురువులు ఆశీస్సులు అందజేశారు. పలువురు అఘోరిలు, భక్తులు పాల్గొన్నారు.

వరి పొలాలు పరిశీలన

పాలకోడేరు/ఉండి, జూలై 21: భారీ వర్షాలకు పాలకోడేరు మండలంలో మునకకు గురైన వరిపంట పొలాలను, కూరగాయల పంటలను వ్యవసాయ శాఖ జేడీ వెంకటేశ్వర్లు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఉండి మండలం యండగండి-ఉప్పులూరుల్లో ముంపు బారిన పడిన వరిపొలాలను జేడీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. స్వల్పకాలిక రకాలు ఎంటీయూ 1153, ఎంటీయూ 1156 వేసుకోవాలని ఆయన సూచించారు. కొద్దిరోజులు నాట్లు వేసుకోవడం వాయిదా వేసుకోవాలన్నారు. చేలలో నుంచి నీరు లాగిన తరువాత నాట్లు వేసుకోవాలన్నారు. యండగండి మీడియం డ్రైయిన్‌ని, దానిని ఆనుకుని మునిగి వున్న వరిచేలను ఆయన పరిశీలించారు. యండగండి, ఉప్పులూరు, చిలుకూరుల్లో 700 ఎకరాలు వరకు నష్టపోయే అవకాశం వుందన్నారు.